సాక్షి
కామారెడ్డి
సోమవారం । 17 । జూలై । 2023



అమ్మకు బోనం

జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

- 9లో ▸



అలుగుకు బుంగ..

సింగితం రిజర్వాయర్ అలుగుకు బుంగలు పడడంతో నీరు వృథాగా పోతోంది. మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. బలమైన గాలులు వీయవచ్చు. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

‘స్పీకర్‌ను విమర్శిస్తే ఊరుకోం’



బాన్సువాడ: వ్యవసాయం గురించి పూర్తిగా తెలిసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి స్పీకర్ యనమల రామకృష్ణుడుకు బూట్లు తొడిగిన చరిత్ర ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిదన్నారు. దీనికి సంబంధించిన ఫొటోను ఆయన ప్రదర్శించారు. అలాంటి రేవంత్‌రెడ్డి స్పీకర్ పోచారంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, పాత బాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, నారాయణరెడ్డి, గంగుల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 771 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 771 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మంజీర నది పారుతోంది. దీంతో నిజాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,387.60 అడుగుల(3.157 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని బోనాల పండుగ నేపథ్యంలో ఈవారం రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. వచ్చేవారం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

23న జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో 23వ తేదీన కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు గంప శశాంక్ జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వెయ్యి మందికి ఉపాధి కల్పించడం కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో 60 కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. 2016 నుంచి 2022 వరకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మా, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన వారు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నమల్లారెడ్డి మాజీ సర్పంచ్ రామాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, కే.లక్ష్మీనారాయణ, అనిల్‌రెడ్డి, పజిల్, పంపరి రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సు సర్వీస్‌లు


- ప్రతి పౌర్ణమికి అందుబాటులో..

ఖలీల్‌వాడి : నిజామాబాద్, కామారెడ్డి నుంచి అరుణాచలంకు వెళ్లేందుకు రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంటాయని, 10 రోజుల ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలని డిప్యూటీ ఆర్‌ఎం(ఆపరేషన్) సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పౌర్ణమికి ఈ బస్సులు అందుబాటులో ఉంటుందని, పదిరోజుల ముందుగానే సీట్ల కోసం రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 30న రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, 1వ తేదీ ఉదయం వరకు కాణిపాక, గోల్డెన్‌టెంపుల్, అరుణాచలం గిరి ప్రదర్శన జరుగుతుందన్నారు. 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి 2వ తేదీ మధ్యాహ్నం నిజామాబాద్‌కు బస్సులు చేరుకుంటాయన్నారు. నిజామాబాద్‌లో రాజధానిలో ఒకరికి రూ.4,800, పిల్లలకు రూ.3,900, కామారెడ్డి నుంచి రూ. 4 వేలు, పిల్లలకు రూ.3,300 ఉండగా సూపర్ లగ్జరీ బస్సుకు నిజామాబాద్ నుంచి రూ.4,200, పిల్లలకు 3,400, కామారెడ్డి నుంచి రూ. 4 వేలు, పిల్లలకు రూ.3,300 ఉంటుందని తెలిపారు.

ధరణి తెచ్చిన తిప్పలు

వారు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు. సొంతింటి కల నెరవేర్చుకోవడానికి పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొన్నారు. 15 ఏళ్ల క్రితమే రిజిస్ట్రేషన్ అయ్యింది. కానీ ధరణి పోర్టల్ వచ్చాక వారికి కష్టాలు మొదలయ్యాయి. వారు కొనుగోలు చేసిన ప్లాట్లు ప్రభుత్వ భూమిగా నమోదవడంతో ఆందోళన చెందుతున్నారు. న్యాయం చేయాలని కోరుతున్నారు.

- పైసాపైసా కూడబెట్టి ప్లాట్లు కొన్న పేదలు
- సర్కారు భూమిగా చూపిస్తున్న పోర్టల్
- న్యాయం చేయాలంటున్న బాధితులు



ప్లాట్ల వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలతో బాధితులు (ఫైల్)

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణానికి సమీపంలో పాత ఎస్పీ కార్యాలయం పక్కన 613, 616, 617, 618 సర్వే నంబర్లలోని భూమిని 2003లో ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఆ భూమి అప్పట్లో అడ్లూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనమైంది. 2003లో జీపీ పరిధిలో 6–2003–04 ఎల్‌పీ నంబర్ అనుమతితో ప్లాట్లు చేశారు. ఆ ప్లాట్లను విక్రయించి, 2006 నుంచి సేల్ డీడ్‌తో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఈ వెంచర్‌లలో నాలుగు సర్వే నంబర్‌లలో సుమారు 350 మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. అయితే 616 సర్వే నంబర్‌లోని భూములను మినహాయించి మిగతా సర్వే నంబర్‌లలోనివి ధరణిలో ప్రభుత్వ భూములుగా రికార్డయ్యాయి. 613, 617, 618 సర్వే నంబర్లలోని భూమి ప్రభుత్వ భూమిగా పేర్కొనడంతో.. అందులోని ప్లాట్లను కొనుగోలు చేసిన 200 మందికిపైగా ఆందోళన చెందుతున్నారు.

క్రమబద్ధీకరణ చేయిస్తామంటూ..

బాధితుల ఆందోళనను కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. జీవో నంబర్ 59 కింద ప్లాట్లను క్రమబద్ధీకరణ చేయిస్తామంటూ ఓ మహిళా కౌన్సిలర్ భర్త, మరో కౌన్సిలర్, ఇంకో వ్యక్తి మోసం చేస్తున్నారు. నలభై మందినుంచి ఒక్కో ప్లాటుకు రూ. 30 వేలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది. కాగా ఈ ప్లాట్లను కొనుగోలు చేసినవారు ఎల్‌ఆర్‌ఎస్‌కు సైతం దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి, ఈ సర్వేనంబర్‌లలోని భూములు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని ఉన్నతాధికారులకు నివేదిస్తామని, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయని తెల్చి చెప్పారు. దీంతో బాధితుల్లో ఆందోళన పెరిగింది.

ఏం జరిగిందంటే..

పట్టణంలోని శాంతి టాకీస్ ఏరియాలో ఉన్న భూమిని సుమారు ఐదు దశాబ్దాల క్రితం రోడ్డు కోసం ప్రభుత్వం సేకరించింది. అప్పట్లో భూము లు కోల్పోయినవారికి నష్ట పరిహారం కింద 613, 616, 617, 618 సర్వే నంబర్లలోని భూమిని కేటాయించింది. ప్రభుత్వమే తమకు ఈ స్థలం ఇచ్చిందని పట్టణానికి చెందిన కుంబాల కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. తాము పట్టా పాసుపుస్తకాలతో నిబంధనల మేరకు ప్లాట్లు చేసి విక్రయించామని తెలిపారు. ఎన్‌వోసీ లేదని ఈ భూములను ‘ధరణి’లో ప్రభుత్వ భూములుగా చూపడం అన్యాయమని పేర్కొంటున్నారు.

బాధితులు పేదలే..

ఈ ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో ఎక్కువమంది పేద, మధ్య తరగతికి చెందినవారే.. బీడీలు చుడుతూ, వ్యవసాయం, మేస్త్రీ, కూలి పనులు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ, దుకాణాల్లో పని చేస్తున్నవారే ఎక్కువగా ఉన్నారు. ప్లాటుకు డబ్బులు సరిపోక బంగారు ఆభరణాలు అమ్ముకున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కన గ్రామాలు, మాచారెడ్డి, భిక్కనూరు, సదాశివనగర్, తాడ్వాయి దోమకొండ, గంభీరావుపేట తదితర మండలాలకు చెందినవారు ప్లాట్లు కొనుగోలు చేసినవారిలో ఉన్నారు.

బీడీల డబ్బులతో కొన్నా



నేను బీడీలు చేసుకుంటూ పైసాపైసా పోగుచేసి 2006లో ప్లాటు కొన్నాను. ఇల్లు కట్టుకోవడానికో.. పిల్లల బతుకుదెరువుకో పనికి వస్తద ని కొన్నం. ఇప్పుడు అది ప్రభుత్వ భూమి అంటున్నరు. ఏం తోస్తలేదు.

– నాగవ్వ, బస్వాపూర్

పైసలు లేక ఇల్లు కట్టుకోలే..



వ్యవసాయం చేసుకుంటూ కూలి పనికి పోయి డబ్బులు కూడబెట్టి ప్లాటు కొన్నం. పైసలు లేక ఇల్లు కట్టుకోలే. ఇప్పుడు చిన్నగా ఇళ్లు కట్టుకుందామంటే ఇది ప్రభుత్వ స్థలమంటున్నరు. మాకు సర్కారు న్యాయం చేయాలె.

– లలిత, ఉప్పల్‌వాయి

రిజిస్ట్రేషన్ ఎందుకు చేసింద్రు



వ్యవసాయం చేసి ప్లాటు కొన్న. ఇది సర్కారు భూ మి అయితే అప్పుడు మా కు రిజిస్ట్రేషన్‌లు ఎట్ల చేసింద్రు. ఇప్పుడు ప్రభుత్వానిదని ఎందుకు అడ్డుకుంటున్నరు. మాకు అప్పుడే చెబితే తీసుకునేటోళ్లం కాదుగదా.

– బిక్కు నాయక్, ఎల్లంపేట

పుస్తెలమ్మి కొనుక్కున్న..



బీడీల చేసిన పైసలతోని ప్లాటు కొనుక్కున్న. పైసలు సరిపోక పుస్తెలమ్మిన. అప్పుడు ఎవరూ సర్కారు భూమి అని అడ్డు చెప్పలేదు. ఇప్పుడు రోడ్డున పడేస్తె ఎట్ల. అధికారులు స్పందించి న్యాయం చేయాలె..

– లక్ష్మి, చిన్నమల్లారెడ్డి

ఉసురుపోసుకోవద్దు..



మ్యాదరి పనితో బుట్టలు, చాటలు చేసి, కట్టెలు అమ్మి సంపాదించిన పైసలతో 2014లో ప్లాటు కొన్నా. ఇప్పుడా భూమి ప్రభుత్వానిదంటున్నరు. అధికారులు న్యాయం చేయాలి. మా ఉసురు పోసుకోవద్దు.

– మ్యాదరి సాయిలు, బస్వాపూర్

అది ప్రభుత్వ భూమే..

పట్టణ శివారులోని 613, 617, 618 సర్వే నంబర్లలోనిది ప్రభుత్వ భూమే.. ఎప్పటి నుంచో ప్రభుత్వం పరిధిలోనే రికార్డులు చూపిస్తున్నాయి. ఆ ప్లాట్లను జీవో 59 కింద క్రమబద్ధీకరించడం సాధ్యం కాదు. బాధితులకు ఈ విషయం చెప్పాను. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తా.

– శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో, కామారెడ్డి

వృథాగా దుకాణాలు.. వానలోనే విక్రయాలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలోని గాంధీ గంజ్‌లో నిర్మించిన రైతు బజార్ వృథాగా ఉంటోంది. ఖాళీగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోంది. అయినా రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు రైతులు సుభాష్‌రోడ్‌లో రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు స్పందించడం లేదు. ఆదివారం జిల్లాకేంద్రంలో భారీ వర్షం కురిసింది. రైతులు వానకు తడిసిపోయారు. వరద నీరు రోడ్లపై ప్రవహించింది. దీంతో రైతులతోపాటు కూరగాయలను కొనడానికి వచ్చినవారూ ఇబ్బందిపడ్డారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలో వర్షంలోనూ రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



జిల్లా కేంద్రంలోని గంజ్‌లో వినియోగంలో లేక వృథాగా ఉన్న రైతుబజార్

ఆ ఇంటి గడప తొక్కొద్దు!

- ఆయన ఫొటోలు పార్టీ ఫ్లెక్సీల్లో కనిపించొద్దు
- బీబీపేట నేతలకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి ఆదేశం
- గులాబీ క్యాడర్‌లో అయోమయం



ముజీబొద్దీన్



సుభాష్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: ‘‘ఆయనకు పార్టీలో సభ్యత్వం లేదు. పార్టీతో సంబంధమే లేదు. ఇక మీదట ఎవరూ ఆయన ఇంటి గడప తొక్కొద్దు. ఆయన ఫొటోలు ఫ్లెక్సీల్లో పెట్టొద్దు’ అంటూ బీబీపేట మండల బీఆర్‌ఎస్ నేతలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఇటీవల అల్టిమేటం జారీ చేశారు. అ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడి నుంచి వచ్చిన వార్నింగ్‌తో శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన బిల్డర్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి తాను చదువుకున్న బీబీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆధునిక హంగులతో నిర్మించి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. దీనికి ఆయన సొంతంగా రూ. 6 కోట్లు వెచ్చించారు. దీంతో ఆయన బీబీపేట ‘శ్రీమంతుడు’గా మారారు. అలాగే జనగామతో పాటు భిక్కనూరు మండలం జంగంపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను గేటెడ్ కమ్యూనిటీ తరహాలో నిర్మించి ఇచ్చారు. పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలనే తపన ఉన్న ఇలాంటి వాళ్లు ప్రాంతానికొకరు ఉన్నా గ్రామాలు బాగుపడతాయని ప్రజలు పేర్కొంటున్నారు. సుభాష్‌రెడ్డి అంతటితో ఆగకుండా కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచనల మేరకు రామారెడ్డి మండలం రెడ్డిపేట, మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామాల్లో మన ఊరు– మన బడి’ కింద మంజూరైన పాఠశాల భవనాల నిర్మాణ బాధ్యతను ఆయనే తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులకు తాను కొంత కలిపి స్కూల్ భవనాలు నిర్మించేందుకు సిద్ధమయ్యారు. అయితే బీబీపేట ప్రాంతంలో ఇప్పటికే పలుకుబడి ఉన్న సుభాష్‌రెడ్డికి పాఠశాల భవనం నిర్మించిన తరువాత నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోనూ అభిమానులు పెరిగారు. ఈ క్రమంలో ఆయన క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారన్న ప్రచారం జోరందుకుంది. దీనికి తోడు మీడియాలో రకరకాల కథనాలు ప్రసారమయ్యాయి.

కలవొద్దంటూ కట్టడి...

హైదరాబాద్‌లో స్థిరపడి వ్యాపార, నిర్మాణ రంగాలలో రాణించిన సుభాష్‌రెడ్డి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. బీబీపేట లో తాను చదివిన పాఠశాల శిథిలావస్థకు చేరగా దానిని పునర్నిర్మించేందుకు సుభాష్‌రెడ్డి నడుం బిగించారు. గంప గోవర్ధన్ ప్రోత్సాహంతో ఆయన ఆ భవనాన్ని కార్పొరేట్ పాఠశాల తరహాలో ఆధునిక హంగులతో పూర్తి చేశారు. భవన ప్రారంభోత్సవంలో మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీబీపేటకు జూనియర్ కాలేజ్ మంజూరు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. గ్రామానికి సినీ నటుడు మహేశ్‌బాబును తీసుకువస్తానని మాటిచ్చారు. దీంతో పాఠశాలను నిర్మించిన సుభాష్‌రెడ్డికి మంచి పేరు వచ్చింది. ఇటీవలి కాలంలో రాజకీయంగా ఏం జరిగిందో తెలియదుగానీ.. బీబీపేట ప్రాంత బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ఎవరూ సుభాష్‌రెడ్డి ఇంటి కడప తొక్కొద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఇందులో భాగంగానే ఓ యువ నాయకుడిని ఇటీవల పార్టీ నుంచి బహిష్కరించారని తెలుస్తోంది. మరో ప్రజాప్రతినిధి సుభాష్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసి మందలించినట్టు ప్రచారం జరుగుతోంది.

‘పోటీ’కి వస్తారనా!?

సుభాష్‌రెడ్డి స్కూల్ భవనం నిర్మించిన తర్వాత ఆయనకు బాగా పేరు వచ్చింది. ఈ ప్రాంతంలో ఆయన ఓ స్టార్‌గా మారారు. చుట్టు పక్కల గ్రామాలే కాకుండా ఇతర మండలాలకు చెందిన నాయకులు కూడా ఆయన వద్దకు వెళ్లి కలుస్తున్నారు. ఈ క్రమంలో ఆయన జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేయాలని భావిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆయన బీఆర్‌ఎస్ నుంచి జహీరాబాద్ ఎంపీ టికెట్టు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంపీ సీటు కోసం సుభాష్‌రెడ్డి ప్రయత్నిస్తే.. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ వర్గం నుంచి వ్యతిరేకత రావాలి. కానీ అందుకు భిన్నంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ స్పందిస్తుండడంపై పార్టీలో చర్చ నడుస్తోంది. ఇద్దరి మధ్య ఏం జరిగిందన్నది తెలియడం లేదు. జిల్లా అధ్యక్షుడి ఆదేశాలతో బీబీపేట ప్రాంత గులాబీ నేతలు అయోమయానికి గురవుతున్నారు.

23న కామారెడ్డిలో మెగా జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో 23వ తేదీన కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు గంప శశాంక్ జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వెయ్యి మందికి ఉపాధి కల్పించడం కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో 60 కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. 2016 నుంచి 2022 వరకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మా, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన వారు జాబ్ మేళాలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నమల్లారెడ్డి మాజీ సర్పంచ్ రామాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, కే.లక్ష్మీనారాయణ, అనిల్‌రెడ్డి, పజిల్, పంపరి రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసిత్రం!

- ర్యాగట్లపల్లిలో ఒక్కరికే రైతు బీమా పరిహారం మంజూరు
- 12 మందికి ఇచ్చినట్లుగా బీఆర్‌ఎస్ ఫ్లెక్సీ
- తప్పుడు ప్రచారంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ర్యాగట్లపల్లిలో బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

భిక్కనూరు: ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీలు ప్రచారంపై దృష్టి సారించాయి. ప్రధాన పార్టీలు వాల్ రైటింగ్ చేయిస్తున్నాయి. అధి కార పార్టీ ఓ అడుగు ముందుకేసి గ్రామాల వారీగా చేసిన అభివృద్ధిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయిస్తోంది. అయితే ఆ ఫ్లెక్సీల్లోని సమాచారాన్ని చూసి ఆయా గ్రామాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భిక్కనూరు మండలం ర్యాగట్లపల్లిలో ఒక్క రైతు కుటుంబానికే బీమా పరిహారం దక్కింది. గ్రామానికి చెందిన రైతు గోపాల్ మృతిచెందడంతో ఆయ న కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం అందింది. అయితే బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో 12 మందికి రైతుబీమా కింద రూ. 60 లక్షల సాయం అందించినట్లుగా పేర్కొనడం గమనార్హం. దీనిని చూసి గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. రైతుబీమా ప్రారంభించిన తర్వా త పలువురు రైతులు మృతిచెందారని, కానీ వారు బీమా పథకానికి అర్హులు కాకపోవడంతో వారి కుటుంబాలకు సాయం అందలేదని పేర్కొంటున్నా రు. ఒక్కరికే రైతుబీమా అందగా.. 12 మందికి పరిహారం ఇచ్చారని ఎలా చెబుతారని ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

మంజీరలో జల సవ్వడి



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మంజీర వాగు వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. వానకాలం మొదలైనప్పటి నుంచి వర్షాలు కురుస్తుండడంతో పాటు ఎగువన ఉన్న గ్రామాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం మంజీర వాగులో జలసవ్వడి కనిపించింది. ఇన్ని రోజులు వాగులో చుక్క నీరు లేక ఎండిపోగా ప్రస్తుతం వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో మంజీర వంతెనపై వెళ్తున్న వారు నీటిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతన్న ఐడియా అదిరింది




లింగంపేట: కలుపు తీయడంలో పది మంది చేయాల్సిన పనిని ఇద్దరు రైతులు మాత్రమే చేస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. లింగంపేట మండలం సురాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు జక్కన్నగారి నర్సింలు, గజ్జెల్లి కాశీరాం ఇద్దరు కలిసి మూడు ఎకరాల చేనులో పత్తి సాగు చేస్తున్నారు. పత్తి పంటలో గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడంతో కూలీలను పెట్టి కలుపు తీయించాలంటే డబ్బులు ఎక్కువ అవుతాయని ఆలోచించారు. రూ.400 ఖర్చుతో సైకిల్ హ్యాండిల్‌తో పాటు ముందు చక్రం భాగానికి ఇనుప చువ్వలతో నాలుగు కొంకుల ఆకారంలో తయారు చేయించారు. దానిని బైక్‌కు కట్టి ఒకరు బైక్ నడుపుతూ, మరొకరు హ్యాండిల్‌ను గట్టిగా ఒడిసి పట్టుకుంటూ కలుపు తీస్తున్నారు. ఈ పద్ధతితో తక్కువ ఖర్చుతో కలుపు తీయొచ్చని వారు తెలిపారు. సమయం కూడా ఆదా అవుతుందన్నారు.

ఐటీఐలో అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మోర్తాడ్(బాల్కొండ): ఐటీఐలో రెండో దశ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమ్మర్‌పల్లి ఐటీఐ ప్రిన్సిపాల్, నిర్మల్ జిల్లా కన్వీనర్ కె.శాంతారాం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. సీట్ల కేటాయింపు సమాచారాన్ని ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియజేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి www. iti. telangana. gov. in వెబ్‌పోర్టల్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పనితీరులో వెనక'బడి'!

- ప్రభుత్వ పాఠశాలల గ్రేడింగ్ విడుదల చేసిన కేంద్ర విద్యా శాఖ
- వెనకబడిన ఉమ్మడి జిల్లా
- మౌలిక వసతుల్లో అంతంతమాత్రమే..



సిరికొండ: కేంద్ర విద్యా శాఖ ఇటీవల విడుదల చేసిన ప్రభుత్వ పాఠశాలల పనితీరు గ్రేడింగ్ సూచికలో ఉమ్మడి జిల్లా వెనకబడింది. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కొరత, డిజిటల్ విద్యా విధానం లేకపోవడం, ఉపాధ్యాయుల కొరతతో ఫెర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు వెనకబడ్డాయి. కేంద్ర విద్యా శాఖ 2021–22 సంవత్సరానికి సంబంధించి అన్ని రాష్ట్రాల్లో విద్యా స్థితిగతులపై అధ్యయనం చేసి పనితీరు గ్రేడింగ్ సూచికలను విడుదల చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ, యూ–డైస్, న్యాస్, ఎండీఎం ద్వారా వివరాలను సేకరించిన కేంద్ర విద్యా శాఖ వాటిని క్రోడీకరించి ఫలితాలను ప్రకటించినది. జిల్లాల వారిగా విడుదల చేసిన ఫలితాల్లో నిజామాబాద్ ఆరో స్థానంలో, కామారెడ్డి 18వ స్థానంలో నిలిచాయి. అభ్యసన సామర్థ్యాల మదింపు, మౌలిక వసతులు, డిజిటల్ అభ్యసనం, పాఠశాల భద్రత, పరిపాలన విధానం, ప్రభావంతమైన తరగతి గది మొదలైన అంశాలలో ఫలితాలను విశ్లేషించారు. ప్రభావంతమైన తరగతి గది, డిజిటల్ లెర్నింగ్ ఉమ్మడి జిల్లాను కొంతమేర నిలబెట్టగా మిగిలిన అంశాలలో పూర్తిగా వెనకబడినది.

ప్రక్షాళన అవసరం

ప్రాథమిక విద్యాశాఖలో విద్యార్థిని పాస్ చేయించే ప్రక్రియలో విద్యార్థి సూక్ష్మప్రగతిని ఉపాధ్యాయులు అంచనా వేయలేకపోతున్నారు. అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 1200 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు, మూత్రశాలలు, అదనపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్లు ఉన్న బోధించే ఉపాధ్యాయులు లేక డిజిటల్ విద్య అందని ద్రాక్షగా మారింది. శిథిలావస్థకు చేరిన తరగతి గదులు పాఠశాల భవనాల వల్ల ఉమ్మడి జిల్లా వెనుకబడి ఉంది. మన ఊరు మన బడి పథకం మొదటి విడత కింద కొన్ని పాఠశాలల్లో మాత్రమే వసతులు కల్పించారు. రెండో విడత ఇంకా ప్రారంభం కాలేదు. మధ్యాహ్న భోజనం నిర్వహణలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యమైన భోజనం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఒక్క గాంధారి మండలంలో తప్ప మిగతా మండలాల్లో ఇన్‌చార్జి మండల విద్యా శాఖ అధికారులు ఉండటంతో విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ గాడి తప్పింది.

కేంద్ర నివేదికలో ఉమ్మడి జిల్లాకు వచ్చిన మార్కులు

అంశం	మొత్తం మార్కులు	నిజామాబాద్	కామారెడ్డి
అభ్యసన సామర్థ్యాలు	51	31	27
ప్రభావవంతమైన తరగతి గది	90	83	74
మౌలిక వసతులు	35	31	30
పాఠశాల భద్రత–విద్యార్థి సంరక్షణ	50	15	07
డిజిటల్ లర్నింగ్	84	63	69
పరిపాలన విధానం	290	127	119
మొత్తం	600	350	326

వసతులు కల్పించాలి



పనితీరు గ్రేడింగ్ నివేదికలో కొన్ని అంశాల్లో బాగా వెనకబడ్డాం. అందుకుగాను బడుల్లో మౌలిక వసతుల కల్పన జరగాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. నాణ్యమైన బోధనను విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– సురేష్, పీజీహెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

ఉత్తమ ఠాణాగా నస్రుల్లాబాద్



నస్రుల్లాబాద్ పోలీసు స్టేషన్

జిల్లాలో ఫస్ట్.. రాష్ట్రంలో ఏడో స్థానం

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ పోలీస్ స్టేషన్ ఉత్తమ ఠాణాగా ఎంపికైంది. పలు అంశాలను ప్రామాణికంగా తీసుకుని చేసిన ఎంపికలో రాష్ట్ర స్థాయిలో ఏడో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహాల ఆచూకీ, తప్పిపోయిన వారిని వెతికి తేవడం, బలహీన వర్గాలపై నేరాలు తగ్గించడం, పాత నేరస్తులను గుర్తించడం, స్నేహ పూర్వక వాతావరణంలో పోలీసు స్టేషన్ నిర్వహించడం మొదలయిన అంశాల్లో గుర్తింపు లభించింది. జిల్లాలోని కామారెడ్డి, మద్నూర్, బిచ్కుంద పోలీసు స్టేషన్‌లు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాయి. ఏడాదిగా నస్రుల్లాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల్లో ఒక్కరు కూడా మృతి చెందిన ఘటనలు చోటు చేసుకోలేదు. ఘటన జరిగిన చోటికి వెళ్లగానే పోలీసు వాహనంలోనే క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రజల ప్రాణాలను కాపాడారు.

ఉన్నతాధికారుల సహకారంతో..



నస్రుల్లాబాద్ పోలీసు స్టేషన్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. ఉన్నతాధి కారుల ప్రోత్సాహం, సిబ్బంది, మండల ప్రజల సహకారంతో ఈ ఘనత సాధించాం.

– రంజిత్‌రెడ్డి, ఎస్సై

కనువిందు చేస్తున్న జింకలు



మద్నూర్ శివారులో జింకల గుంపు

మద్నూర్: మండలంలోని దన్నూర్, సుల్తాన్‌పేట్, మద్నూర్, మేనూర్ శివారు ప్రాంతాల్లో జింకలు, నెమళ్లు సందడి చేస్తున్నాయి. వాతావరణం చల్లబడడంతో జింకలు గుంపులు గుంపులుగా రోడ్డు వెంట పరుగులు పెడుతూ ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం మద్నూర్, దన్నూర్ శివారులో జింకల గుంపు సందడి చేసిన చిత్రాలను సాక్షి క్లిక్ మనిపించింది.

యథేచ్ఛగా ఇసుక దందా!

- కందకుర్తి, పేపర్‌మిల్ గ్రామాల్లో భారీగా ఇసుక డంపులు
- పట్టించుకోని అధికారులు



కందకుర్తి గ్రామంలో ఇసుక డంపు

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గ్రామంలో అక్రమ ఇసుక నిల్వలు భారీగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాలు కనపడితే చాలు ఇసుక డంపు చేస్తున్నారు. కందకుర్తి, పేపర్‌మిల్ గ్రామాల నుంచి నిత్యం ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పగలు రాత్రీ అనే తేడా లేకుండా మండలం నుంచి నిజామాబాద్, భైంసా పట్టణాలకు టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచే ఇసుక తరలుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. జెడ్పీటీసీ మేక విజయ ఇటీవల సంబంధిత శాఖల అధికారులకు ఇసుక దందాపై ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. కొందరు నాయకులు, అక్రమార్కులు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఒత్తిడి తీసుకు వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎల్లారెడ్డిలో ఘనంగా బోనాలు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే



పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి



పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్



ఎల్లారెడ్డిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముత్యాల పోచమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ దంపతులు, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారి పలారం బండి వద్ద స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సురేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఊర దేవతకు పూజలను నిర్వహించిన అనంతరం మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లారు. కౌన్సిలర్లు శ్రీకాంత్, సాయిలు, ఆలయ కమిటీ కార్యదర్శి వినోద్, సభ్యులు శ్రీనివాస్, గాంధారి ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, మాజీ మంత్రి ఆంజనేయులు, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. డీఎస్పీ జగన్నాథరెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పటువస్త్రాలు సమర్పించిన నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: అమ్మవారికి పలు పార్టీల నాయకులు పట్టు వస్త్రాలను సమర్పించారు. పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు.



నృత్యాలు చేస్తున్న కళాకారులు



ఉత్సవాల్లో పాల్గొన్న స్పీకర్ పోచారం



చుట్టూ పచ్చని పొలాలు.. మరోవైపు తటాకం.. మధ్యలో ప్రశాంత వాతావరణంలో చిన్న పల్లెటూరు.. ప్రకృతి ఒడిలో అలరారుతూ ఆకట్టుకుంటోంది కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలంలోని తిమ్మాపూర్ గ్రామం.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్



సుభాష్‌నగర్: హత్య కేసులో నగరంలోని గుర్బాబాది రోడ్డులోగల సార్వజనిక్ శ్మశానవాటిలో నివసిస్తున్న నాగుల మల్లేష్, నాగుల దశరథ్‌ను అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ టౌన్ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆదివారం మూడో టౌన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లేష్, దశరథ్ తమ తల్లితో కలిసి శ్మశాన వాటికలో నివసిస్తున్నారు. వారి తల్లికి మతిస్థిమితం లేదు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో నిందితులిద్దరూ సినిమా చూసి శ్మశాన వాటికకు చేరుకున్నారు. ఆ సమయంలో బీహార్‌కు చెందిన హమాలీ అరుణ్ సదా వారి తల్లితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అది చూసిన వారు అరుణ్ సదాను కర్రతో విచక్షణారహితంగా కొట్టారు. అటుగా వెళ్తున్న ఆటోవాలాలు క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అరుణ్ సదా మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా, నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. పోలీసులు వారి నుంచి కర్రను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రేతలు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గంజాయి విక్రయిస్తున్న పాన్‌షాపు యజమాని షేక్ నయీంను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్టీవెన్‌సన్ తెలిపారు. అతని నుంచి 200 గ్రాములు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నయీంను విచారించగా పెర్కిట్‌కు చెందిన షేక్ సోఫియాన్ తనకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించాడని ఎస్‌హెచ్‌వో చెప్పారు. అలాగే మరో వేయి గ్రాముల గంజాయికి ఆర్డర్ ఇచ్చినట్లు నయీం పోలీసులకు తెలిపాడు. దీంతో నయీంకు సరఫరా చేస్తున్న సోఫియాన్‌ను అరెస్టు చేసి ఇద్దరి నుంచి 1,200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కప్పల వాగులోకి కాళేశ్వరం జలాలు



నీటి విడుదల అనంతరం ప్రజాప్రతినిధులతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్: కాళేశ్వరం జలాలను ప్యాకేజీ 21 ద్వారా మండలంలోని బడా భీమ్‌గల్ వద్ద కప్పల వాగులోకి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు లేకున్నా అన్నదాతకు బాసటగా నిలవడం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. కాళేశ్వరం నీళ్ల రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీలోకి చేరుకొని అక్కడి నుంచి సారంగపూర్, మెంట్రజ్‌పల్లి పంప్ హౌజ్ ప్యాకేజీ 20, 21 ద్వారా పెద్ద వాగు, కప్పల వాగులోకి చేరుకున్నాయని తెలిపారు. వాగులోకి ఎదురెక్కి వస్తున్న కాళేశ్వరం జలాలు చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ప్యాకేజీ 21 ద్వారా వచ్చిన నీటితో పెద్ద వాగు, కప్పల వాగు ఎప్పుడూ సజీవంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చౌటపల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్ పాల్గొన్నారు.

వైశ్యులు వ్యాపారాల్లో వృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మడి శివకుమార్

నిజామాబాద్ సిటీ: వైశ్యులు వ్యాపారాలు మాని ఇతర రంగాల వైపు వెళ్తున్నారని, ప్రతి వైశ్యుడు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వైశ్య బిజినెస్ నెట్‌వర్క్(వీబీఎన్) స్థాపించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ఎమ్మెడి శివకుమార్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ హోటల్ నిఖిల్‌సాయిలో వైశ్య బిజినెస్ నెట్‌వర్కు నిజామాబాద్ బ్రెయిన్‌స్టోమింగ్ సమావేశం జరిగింది. వీబీఎన్ సభ్యులు నాణ్యమైన వ్యాపార నిపుణులతో తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అభివృద్ధి చెందిన నగరాల్లో వీబీఎన్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. వీబీఎన్ అపెక్స్ చైర్మన్ రాజేష్ డొంకేశ్వర్ మాట్లాడుతూ సంస్థలో సభ్యుడిగా చేరిన వారికి వారి వ్యాపారంలో సపోర్ట్ చేయాలనే దీనిని ప్రారంభించినట్లు చెప్పారు. చంద్రశేఖర్ వేముల, శ్రీనివాస్ కల్లూరి, అరుణ్ పాల్గొన్నారు.

వర్సిటీ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెయూ ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు తరుణ్ డిమాండ్ చేశారు. వర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని ఆదివారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు. తరుణ్ మాట్లాడుతూ.. క్యాంపస్ రోడ్ల వెంట వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి బయట తిరుగడానికి విద్యార్థులు భయపడుతున్నారని చెప్పారు. హాస్టల్ గదుల్లో ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్‌లు లేవని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాలికల కోసం అదనపు హాస్టల్ నిర్మించాలన్నారు. ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన వాకాటి కరుణ వర్సిటీని సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. శేఖర్, విష్ణువర్ధన్, సంతోష్, సాయి, అజయ్, ఆశిష్, అరవింద్, అనిల్, ముఖేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

మద్నూర్: మద్నూర్‌కు చెందిన చిట్టెం శ్రీనివాస్(26) స్థానిక గురు ఫంక్షన్ హాల్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు.. శ్రీనివాస్ సాలూర మండల కేంద్రంలోని తన అత్తగారి ఇంటి వద్ద భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. అక్కడే కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 13న సాలూర నుంచి శ్రీనివాస్ మద్నూర్‌కు వచ్చాడు. తన భార్య తనతో మద్నూర్‌కు రావడం లేదని పలువురితో బాధను పంచుకున్నాడు. ఈ క్రమంలో 14న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన ఆచూకీ కోసం వెతకగా చెట్టుకు ఉరి వేసుకొని ఉన్నట్లు సమాచారం వచ్చిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు..



కామారెడ్డి క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భిక్కనూర్, అంతంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ముంబై నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం రావడంతో కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి వయస్సు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం బట్టాపూర్ శివారులోని కుశీవల ఫంక్షన్ హాల్‌లో పేకాడుతున్న పది మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి నుంచి రూ.9,070 నగదు, 9 ఫోన్లు, 4 బైక్‌లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్గట్ల ఏఎస్సై గంగాధర్ వారిని అరెస్టు చేశారని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం!



నవీపేట: బాసర రహదారిపై ఉన్న కల్వర్టుకు మరమ్మతులు చేయకపోవడంతో వర్షానికి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నవీపేట, అభంగపట్నం గ్రామాల మధ్యగల బాసర రహదారిలో ని జాంసాగర్ డి–50 కాలువ ఉంది. రోడ్డు వెడల్పు లో భాగంగా కల్వర్టుకు మరమ్మతులు చేసి ఇరువైపుల మొరం సరిగా వేయకపోవడంతో కోతకు గురవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతు లు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మోపాల్: మండలంలోని సిర్పూర్‌కు చెందిన దీపిక అనే వివాహిత పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. దీపికకు వివాహమై పిల్లలు ఉన్నారు. ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.